# తాసుపాము

రేవులపాడు వూ రెలుపల గెడకర్రలకిమల్లే కిక్కిరిసి నిలబడుండ తాడితోపు మయాన నాగుమల్లె సువ్వకిమల్లే పాంపుట్టలకాడ పాకుతుండ బసవాయిని గొడ్లమందకాడ పేడ కొచ్చిన ఎంకాయి దూరాన్నుంచి సూసింది.

ఆ బసవాయి గిరజాలు అప్పుడే తెలుస్తయి. ఆడిమెళ్ళో ఎండికంటె పదా మడ దూరాన్నుండా తెలుత్తానే వుంటది. గెట్టిగా పంచబిగ్గట్టి నడుంకు ఆవజాన కట్టు బిగించేది వాడే. వాడి మొల్తాడుకు అయిదుగెజ్జలు, రెండునల్లకుచ్చులు ఏళ్ళాడేదికూడా ఎంకాయికి బాగాతెల్సు.

అయితే యీడకూకుండ ఎంకాయికి ఆడ పాంపుట్టలకాడ తచ్చాడ్తుండ బసవాయి అసలేం చేత్తుండదీ తెలపటం బహుకష్టం. అయినా ఎప్పుడు సూసినా ఏ ఎండ్రకాయ బొక్కలకాడో గెడ్డలు తీసుకుని నిలబడ్తావుండేవోడు, యియ్యాల వుండట్టుండి సాటుసాట్న ఆ పాంపుట్టలకాడ తిరగల్సొచ్చిన పనేంటి? ఆడ జనం ఎవురూ లేరుగందా? ఎంకాయి మదన్లోపడ్డది.

గొడ్డమంద గెనుపులెంట, నీలగుంటలకాడ ఆటిదార్న అవి తలలొంచుకుని తిరుగాడ్తుంటే మంద పిల్లకాయలు బిల్లంగోడు ఆడుకుంటావుండారు. ఆటిటు సూసి తోపులోకి సల్లంగా జారబడ్డది పేడపల్లికతో ఎంకాయి

అంత పట్టపగలయినా తాడితోపులోకి ఎల్లేతలికి గలగలమంటా దెగ్గిర దెగ్గిరగా వాలేసుకుండ ఆ తాడిసెట్ల నీడలు బూమ్మీనపడి కరవొచ్చే జడల దెయ్యాలకిమల్లె వుంటం అటుంచి ఏ బొక్కల్లోంచి ఎసువంటి జీవాలు తొంగి సూస్తా వుంటయ్యో ఎసువంటి మడిసికయినా తెలవటం బహుకష్టం.

అడుగులు జారకుండా, చుట్టుపక్కల భద్రంగా సూసుకుంటావొచ్చి బసవాయికి కాస్త వెనకన నిలబడ్డది ఎంకాయి. ఆడ బసవాయి వాలకం, అసలు ఆడేంచేత్తుండదీ ముంగలయితే ఎంకాయికి అంతుబట్టలా. ఓ సేతిలో చెంబోళ్ళ పాంకర్రా, రెండోసేతిలో గొబ్బిరిసిప్పొ పట్టుకుని కోటయకొండపెబకు మల్లే వుండ ఆ పుట్టపక్కన మోకాళ్ళమీన వొంగి సిక్కసూత్తుండ బసవాయిని సూసి కూసేపు ఆటనే నోరుదెరిసింది ఎంకాయి.

మొదలు ఎవురన్నా మాటలమయాన పాము లంటుండేనే వొళ్ళు గరిపొడుసుద్ది! అసువంటిది అసలవి నిజంగానే పొండుకునే అంతలావు పుట్టా అన్ని

బొక్కలకాడ - ఎచ్చగా లోనుంచి అవిరికొడ్తుంటే - ఏ మడిసయినా ఆవజాన అడ వొంగి తొంగి సూత్తుంటం ఏ ఆడగూతురుకయినా ఎట్టింటదీ?

"ఒరేయ్!-" అని గుటకమింగింది ఎంకాయి.

సిరికోతి, సిదర్లో ఎవరయినా ఏడు సముంద్రాలు దాటి, మూడడవుల్ని ఏటుకునరికి, కుప్పేసి, నాలుగో అడివి మయానుండ మర్రిసెట్టు తొర్రకాడ నిల బడి అరవకుండా తొంగి సూత్తుండే యవదానంలో- గవిక్కిన యాషమీన పెటీ మని సరిచి నిటారుగా కూకోబెట్టి నిద్దర్లేపుతే ఎట్టుంటదో అట్టయిపోయి- గవిక్కిన ఎనిక్కి ఒక్క గంతేసి నిలబడి ఎంకాయిని సూశాడు బసవాయి.

"ఆఁయ్- ?" అన్నాడు బసవాయి నోరుదెరిసి.

పళ్ళిక నెత్తినబెట్టుకుని, కోక పైకెగ్గట్టి, ఆవజాన నోరు దెరుసుకు సూత్తుండ అమడిసి గంగానమ్మతల్లనుకుంద బసవాయికి యింకాస్సేపటికిగాని ఎంకాయి ఎంకాయికిమల్లే అగుపించలా.

మొన్నీమద్దె బెద్బాలాట్లో తేలుకొండె జడతో ఎగిర్న ఎంకాయి, వుంద ట్టుండి కోకెగ్గట్టి అవజాన ఆడ నిలబడేతలికి శానబిగిసి గుటకమింగాడు బసవాయి.

"ఒరేయ్?" మళ్ళీ అంది ఎంకాయి.

"ఆఁ?" అన్నాడు మైకంతిరగని బసవాయి.

"ఏందిరా నువ్వు సేత్తుండదీ?" అడిగింది ఎంకాయి.

"ఎవురూ- నేనా?- అయితే ఏంలే-" అంటున్నాడు బసవాయి.

"అయితే ఏంలే అంటాడేం!-" అంది ఎంకాయి.

"కాత్తె పనిమీకుండాలే-" అన్నాడు బసవాయి.

"అబ్బో కాత్తె సెప్పగూడ్దెట్టా ఆ పనేందో?" అంది ఎంకాయి.

"ఆఁ. అదే అనుకుంటుండా-" అన్నాడు బసవాయి.

"అబ్బో మాటలు నేర్చావే నాయనా! యాడకి పొయినాయ్యా యిన్నాల మించీ?" అంది ఎంకాయి.

"ఎటో పోయినాలే-"

"చరే, యిగనేం-" పళ్లిక కిందపడేసి కూకుందది ఎంకాయి.

"నీతో నాకెందుకొచ్చింది, యివకాడ సానాపనుండది నాకు," అన్నాడు బసవాయి. ఏం పట్టించుకోనట్టు పుట్టకాడ తిరుగుతూ.

"ఎవురొద్దన్నారూ, వుంటే చేసుకోరాదూ?" అంది ఎంకాయి.

"అసలు నువు యిటు ఏం పనిమీద వొచ్చినట్టూ?" అన్నాడు బసవాయి పాంబొక్కలోకి తొంగిసూత్తా.

"ఒరేయ్, ఒరేయ్ ఏందిరా సవ్వాడ తొంగిసూసేదీ," అంది ఎంకాయి వుండబట్టలేక.

"పాములే-" అన్నాడు బసవాయి అటనే తొంగిసూత్తా.

"పాములీ! ఎందుకురా పామును తొంగిసూట్టం? అవి మంచివి కాదంటరా!" అంది ఎంకాయి.

"పనివుందిలే," అన్నాడు బసవాయి.

"ఏం పనిరా, కాత్తసెప్పవంట్రా!" అంది ఎంకాయి.

"పామును పట్టుకుంటున్నాలే" అన్నాడు బసవాయి.

"ఆఁ, నిజంగానట్రా! పోరా నీ బడాయిలు నాకాడంట్రా! నీలాంటోళ్లు యింగా పదిజనమలెత్తాల పామును పట్టుకుంటానికి" అంది ఎంకాయి.

"బడాయిలా? చూస్తావా మరీ పట్టానోలేదో? హుఁ! యీ బసవాయంటే అంతే ననుకుండావుగావాల్ను."

"యిగ చాల్లే యిక్కాడికి రారా, పెద్ద పామును ఒట్టే మొగోడివి నేటిగ్గాంగా బయల్దేరావుగానీ. సానానూశాం యిట్టాటోళ్ళని. ఒరేయ్ ఎండ్రకాయలు పట్టుకోక ఎందుకొచ్చిందిరా నీ కాపనీ?" అంది ఎంకాయి.

"నువు సూశావా నే నెండ్రకాయలు పట్టటం?"

"సూశానా యింగా సూశానా? హుఁ! నాకు తెలవకపోద్దిగా నీ సంగతి?" అంది ఎంకాయి.

"ఏందమ్మో నీకు దెల్చింది? శాపలుగదూ నేను పట్టుకునేదీ? కావాలంటే ఎల్లి అడుగు ఎవుర్నయినా"

"ఒరేయ్, సిన్నప్పుడు నవు ఎండ్రకాయల్ని పద్దాకా గెడ్డలుదీసుకుని కొట్టేవోడివిగావంట్రా?" అంది ఎంకాయి.

"సిన్నప్పుడు నీకు తేలుకొండెకిమల్లే జడ వుండేదంటనే యిప్పుడది యాడకి పోయిందమ్మా?"

"ఓ బసవాయోవ్, నా చంగతెరగవు తెల్చిందా?"

"మరి యింకేం! అటనే అనుకోరాదూ నేనుకూడా. హుఁ! అంతలావు ఎగతాళిగా వుండదిగా!"

"అబ్బో మాటలు సానా నేర్చావే!"

"హుఁ! ఆడ నీకే మాటలొచ్చింది. నీకన్న యీడ ఎవురేం తక్కువ తిన్నా- నాతో నీ కెందుకొచ్చిందిగ్గాని యెవకాడ సానాపనుండది నన్ను పలకరిచ్చమాక" అని మళ్లీ పాంబొక్కలో తొంగిసూత్తు డాడు బసవాయి.

"ఒరేయ్, ఒరేయ్ బసవాయ్?"

"ఏం?"

"ఎందుకురా నీకు పాముల జోలి? అని ఎసువంటివో నీకు తెల్సా?" అంది ఎంకాయి.

"హుఁ! యీ బసవాయికి అన్నీతెల్సు, యియ్యాల పైద్దికంలోకి గరగళం తెచ్చిత్తే అద్దరూపాయి డబ్బులిత్తా నన్నాడు రాంబెమ్మయ్య" అన్నాడు బసవాయి.

"గరగళం! గరగళం ఏందిరా?"

"తాసుపాం గరగళం" అన్నాడు బసవాయి.

"తాసుపాం యిసమంట్రా! ఓమ్మో, అందుకంట్రా యీడ నువు తిరుగుతుండదీ?"

"బలేతాసుపాములుండయిలే ఈడ!" అన్నాడు బసవాయి.

"గెట్టిగా అరవమాకరా! నీకు నిజంగా శాతవునంట్రా ఆట్ని పట్టటం?"

"హుఁ! అదొక లెక్కాజమా! మా అయ్యోళ్ళు ఆట్ని మిడతల్ని పట్టుకున్నట్టు పట్టుకుని, నడిబజాట్లు ఆట్ని మొల్తాళ్లు కట్టుకుని తిరిగేవాళ్ళు!" అన్నాడు బసవాయి.

"ఆళ్ళు పెద్దోళ్ళురా! ఆళ్లు ఏం చేసినా చెల్లుద్ది! ఆళ్ళకాడ మంత్రకట్లుండేవంట!"

"అంతావుత్తది. వుత్తదైర్నంమీన పట్టాల్సిందే ఎవుసు పట్టినా" అన్నాడు బసవాయి.

"నీకు దైర్నం వుండదంట్రా?"

"ఎవ్వరికి- నాకా? వుందోలేదో యిప్పుడు తెలుసుద్దిగా" అన్నాడు బసవాయి

"అద్దరూపాయి డబ్బులంట్రా రాంబెమ్మయ్య యిచ్చేది?" అంది ఎంకాయి.

"ఆడు అంతకన్నా యిచ్చిసావడు. సచ్చినోడి పెళ్ళికి వొచ్చిందేసాలు"

"పానంకన్నా తీపంట్రా అద్దరూపాయా? అసలు తాసుపాం ఎంత సెండాలపుదో నీకు తెల్సా? రాంబెమ్మయ్య నిన్ను మాయసేత్తు డాడ్రా"

అంది ఎంకాయి.

"ఇదిగో ఎంకాయోవ్, అద్దరూపాయిలో నీకు పావలా బిళ్ల యిత్తా" అన్నాడు బసవాయి.

"సీ పాడూ- నాకేం అక్కర్లే ఎదవ డబ్బు-"

"నువు సిన్నప్పుడు ఓనాడు మనం కోతికొమ్మిల్లాట ఆడుకుని యింటికి తిరిగొత్తావుంటే సింతలతోపుకాడ నన్నుసాటుగా పిలిసి ఓ పావలాబిళ్ల సంపా యించుకురామంటివే?" అన్నాడు బసవాయి.

"అప్పుడంట్రా! పోరా నీ దంతా! అపుడు సెంచయ్య కొట్టోకి సబ్బిల్ల లొత్తేనీ- ఆశపుట్టిందిరా- సీ పాడూ! అదెప్పుడో సిన్నప్పట్లేరా. ఇప్పుడు సబ్బిల్లరుద్దుకుంటే మాజేజి సంపుద్ది" అంది ఎంకాయి

"అప్పట్నుంచీ ఎప్పుడిద్దామనుకుండా ఓ పావలా బిళ్లన్నా సిక్కకుండా వుండే ఎంకాయ్" అన్నాడు బసవాయి.

"పోనీలేరా ఎదవ పావలాబిళ్లా-"

"ఆఁ, అంతేనా! డబ్బంటే అంతసులకనగా తోసొయ్యమాకేవ్. యియ్యాల బెమ్మదేవుడు దిగొచ్చినా చరే ఆ రాంబెమ్మయ్య దెగ్గిర్నుంచి అద్ద రూపాయిబిళ్ల రావాల్సిందే, నవు మాట్టాడమాక-" అంటా పాంకర్రా, కొబ్బరి సిప్ప గెట్టిగా పట్టుకుని పాంపుట్టకాడ కూకుండాడు బసవాయి.

"బసవాయ్!" పిలిసింది ఎంకాయి.

పాంకర్ర వూత్తా నాగస్వరంపాట మైంకలోపడ్డాడు బసవాయి.

యాడా సడీ సప్పుడు లేదు. దూరాన గొడ్డపిల్లకాయలు బిల్లంగోడు కొట్టుకుంటూనే వుండారు. నాగస్వరానికి నిలబడి ఆడ్తుండ తాసుపాములకిమల్లే సిటారుగా నిలబడుండ తాడిసెట్లు గాలికి సల్లగా అటిటు కదులాడ్తుండయి.

బసవాయి మాట యింపించుకునేట్టులేడు. యీడికి యియ్యాల యిట్టా బుట్టిదేం? యీడు సిన్నప్పుడే నయం. కోతికొమ్మిల్లాట బలే ఆడేవోడు. ఎదవ సచ్చినోడు ఒక్కపాలన్నా నన్ను దొంగను సేసేవోడుకాదు. మాలావు నాకే నెట్టా ఆ మాత్రం ఆట శాతకాందీ? ఆ పిచ్చాయోళ్లు బసవాయిని నన్ను దొంగని సెయమని ఒకటేమయిన ఏడ్సేవోళ్లు! సీ పాడూ! ఆళ్ల దెప్పుడూ యెదవ బుద్దగందా! యిగ యిప్పుడేం వుండదీ? బసవాయి ఆటల్లో కలవటమే మానే శాడు. ఎప్పుడు సూసినా ఏ దొంక మలుపుల్లోనో తిరుగుతావుంటాడు. యీ మద్దె యీడికి మడుసులంటేనే పట్టంలా. మడుసు లేం కరుత్తారా దెగ్గిరకొత్తే?

పావలాబిళ్ల యింకా గాపకం పెట్టుకుందాదే! ఎవ్వరికేం అక్కర్లా - ఆడిత్తానన్నా అక్కర్లా. సీ- డబ్బు లడగడమేంది పాడూ! అప్పుడెప్పుడో అడుగుతే యింకా గాపకంపెట్టుకుందాదే! నామీద ఆడికి నిజంగా గురి వుందదా? ఏంపాడో... యీడికేవన్నా గాలి పట్టలేదుగందా? రాంబెమ్మయ్య అద్దరూపాయి డబ్బులకి తాసుపాంని పట్టుకుని యిసం పిండుతాడంట! యీడి అయ్యోళ్ళుకూడా యింతేనంట. యింకేం యీడూ తయారయ్యాడూ! అద్దరూపాయ్! ఆడన్నట్టు అద్దరూపాయంటే మాటలా! ఆ అద్దరూపాయుంటే ఏంకొన్నా కొనచ్చు- అయితే మట్టుకూ! పాములన్నా పడ్తానంటం? పెమాదంగాదూ? ఒక్కోపాలి- సీ అనగూడదుగానీ- పానాలుగూడా పోతయి... అసలవి వడుసులుందేసోటికి అంత సులబంగా రావంటనే? యీడెంత పాంకర్ర వూదుకున్నా అవి రాకుంటేసరి. అసలా పుట్టలో పాముందదో లేదో? ఉంటే యింతసేపు రాకుండా వుంటదా? ఒకవేళ అది బయటికివొత్తె యీడికి దాన్ని పట్టడం సరీగా శాతకాకపోతే? యింకా ఏమన్నా వుందదీ-"ఒరేయ్ బసవాయ్ యిక సాల్లేరారా!" అంది ఎంకాయి.

బసవాయి ఎప్పుడో నాగలోకానికిపొయ్యాడు. ఎంకాయి యీడ కూకుందదని ఆడికి అసలు తెలవదు. పాంకర్ర వూత్తా అటనే వూగుతుండాడు బసవాయి.

ఎంకాయి కళ్ళు మెరిసినై-ఒక్కపాలి ఎనిక్కి యిరసుకుపడ్డది ఎంకాయి. పుట్టలోంచి తలతలతల మెరుస్తా జలజల జారి దోసెడు పడగిప్పుకుని బసవాయి ముంగల తోకమీన నిలబడి వూగుతా అడ్తుందదా తాసుపాం! అటనే నేలకు నీలుక్కుపోయింది ఎంకాయి.

సిశిరేత్రి మెరుమ్మెరిసి డామ్మని పిడుగుపడ్డట్టు- తాసుపాం తనముంగల నిలబట్టం సూశాడు బసవాయి. పాంకర్రవూత్తానే- ఒక్కపాలి కళ్ళు మూసుకుండాడు బసవాయి. బసవాయి గుడ్లల్లో ముళ్ళు పొడిసినట్టు సూసింది తాసుపాం. ఒల్లు తడిసింది బసవాయికి. మెడతిప్పి ఎనక్కితిరిగి సూశాడు- యిగ్రహంకిమల్లే నీలుక్కుపోయి గడ్లిప్పుకుని సూత్తుందది ఎంకాయి. మెడ బిగిసింది బసవాయికి.

సల్లగా సెయి ఒనుకుతా- పాంకర్ర తాసుపాం పడగమీనకి బోసిత్తు ద బసవాయికి మద్దెలో నరాలు పటపట బిగలాగటాన పట్టుదప్పి ఎనిక్కి తూలిన తూల్టం ఎగ్గిర్లెగిసి గెంతేసి వుసిమీన ఎల్లి ఎంకాయి సెయి పట్టుకుని లాడితోపులోంచి బెయిటికి అదేవయిన లగెత్తాడు.

"యదవ సచ్చినోడా- పానం తీశావుగదరా- యిడూ సెయి-" అంది ఎంకాయి రొప్పుతా

"అరవమాకే-" అన్నాడు బసవాయి. తాడితోపు కల్లి బిత్తరి సూపులు సూత్తా.

"సెపితే యిన్నావంట్రా. ఒరేయ్ ఎండ్రకాయలు పట్టుకోక ఎందుకొచ్చిం దిరా నీ కీపని-" అంది ఎంకాయి ఓపీకుని కళాపి గొట్టినట్టు.

ఆయాల్టినుంచి బసవాయి ఎంటపడింది తాసుపాం పులిస్తరాకు లెగుస్తే తాసుపాం లెగుస్తున్నట్టుంటున్నది బసవాయికి. ఎవురన్నా గబగబ మాట్టాడు కుంటుంటే బసవాయి ఎంటికలు సిక్క బొడుసుకుంటు దై సూర్లో తాడు, రోడ్డు మయాన, రోడుపక్క తాళ్ళనుసూసి ఎనిక్కి ఎగ్గిరి గెంతేసి యీపు సరుసుకుం టుంటాడు బసవాయి. కలలుకన్నాడు బసవాయి గోడ మొత్తలకాడ, గుడిసె సూరుసందుల్లో, శాంతాడుసుట్ట మయాన తననుసూసి తాసుపాం 'బుస్సు' మంటా పడిగ ఎనక్కి తీసుకోటం ఎన్నోసార్లు కల్లోసూశాడు బసవాయి. తమాసా! ఓ నిశిరేత్రి ఎంకాయి తాసుపాముకు మల్లే 'బుస్సు' మంటం సూశాడు బసవాయి.

కొన్నాలకి ఓనాడు సందేల గొడ్డమందతో యింటికి తిరిగొత్తా తాడితోపులో ఆ పుట్టకాడ గెడకర్రకిమల్లే తాడిసెట్లలో కలిసిపోతా ఎవురో నిలబడుంటం మసగ్గా సూసింది ఎంకాయి. ఒక్కపాలిగా నిలిసిపోయింది ఎంకాయి. ముందుకు పోను ఎంకాయికి కాలాడలా. సల్లగా మందసించి ఎనిక్కేనిక్కి తగ్గి తాడితోపుకాడి కొచ్చి సూసింది ఎంకాయి. నిజంగా ఆ పుట్టకాడ ఓ మడిసి నిలబడుండాడు. బసవాయి కాడు గందా? యిదేంది యీడికేవన్నా గాలిబట్టిందా? యీ యాల ప్పుడు ఒంటరిగా ఆడ నిలబట్టానికి ఎంతదైర్నం ఉండాల?

మసగలో తడువుకుంటా పుట్టకాడికొచ్చి - ఒక్క పొలికేక బెట్టి ఆటనే నోరుదెరిసి కొయ్యకిమల్లే నిలబడిపోయింది ఎంకాయి.

ఆ తాసుపాం బసవాయి మెడా, సెయ్యీ బిగదీస్తుంటే, దాని మెడకాడ పట్టుకుని గొబ్బరి సిప్పలోకి దాని యిసం పిండుతుండాడు బసవాయి!

దైర్నంగల మొగోడు గుండెబిగువుమీన దెబ్బయి గెజాల ఎత్తయిన దొజత్తంబంమీనకు ఒక్కొక్క జరుగే జరుక్కుంటా ఎల్తుండే యవదానంలో ఒకాడగూతురు గుండెబేసి ఒక్క పొలికేక పెట్టేతలికి అంత దైర్నంగల మొగోడిగుండె బిగువూ కుండ పగిలినట్టు పగిలి, నరాల పట్టుతప్పి సెవటలు గక్కుతా గిరగిర తిరుగతా దెబ్బకు బూమ్మీన పడాల్సిందన్నమాట!

గబిక్కిన ఎనక్కి తిరిగి సూశాడు బసవాయి వూపిరి బిగబట్టి.

"ఎళ్ళు-" అన్నాడు బసవాయి దవడలు కరుసుకుంటా.

"ఓమ్మో-" మూఁగిలింది ఎంకాయి.

పొట్టలిచ్చిన పత్తికాయలకిమల్లే ఎంకాయికళ్ళు బసవాయి గుండెలమీన దిగినై.

"ఎల్లిపో - మళ్ళీ ఎందుకొచ్చావు యీడకి ? నా పెయి జార్తుందది-ఎల్లిపో అరవకుండా-"

"అఁవనే రా-ఒరేయ్-ఒరేయ్ - నిన్ను సంపుద్దిరా - దాన్ని సంపరా-" మూలిగింది ఎంకాయి.

తాసుపాంకల్లి సూశాడు బసవాయి. తాసుపాం రకుతం గక్కుతా పటపట గొబ్బరిసిప్పను కొరుకుతా వొనుకుతుంది. పెయి సుట్టూ మెల్దిరుగుతుంటే-ఒక్కాపాలి గెట్టిగా నరాలు బిగబట్టి, ఎంకాయి కల్లి కొరకొరసూత్తా సువ్వేకిమల్లే మెల్దిరిగి పుసిమీన తాడిసెట్ల సీకట్లోకి గబగబా లగెత్తుకెల్లాడు బసవాయి.

మరుస నాట్నుంచి జొరంలో మతుండక మంచంలో పడుండాడు బసవాయి. "వాడికేం రాయిలాంటి మనిష." బసవాయికేం ఫరవాలేదన్నాడు ఎంకాయితో వైద్దికుడు రాంబెమ్మయ్య.

కొన్నేళ్ళు గడిసినాక ముగ్గురు బిడ్డల్తో పుట్టింటికి తిరిగొచ్చిన ఎంకాయిని తాడితోపుసాయల్న "ఏం ఎంకాయమ్మోవ్ ?" అని బసవాయి పలకరించేదాకా బసవాయిని ఎంకాయి పోల్చుకోలేకపోయింది.

"సంపావు గదంటయ్యా బసవయ్యా! పోల్చుకోనే లేకపోతినే నా తెలివి పాడుగానూ! బాగుండావంటయ్యా? బొత్తిగా గురుతు పట్టకపోతినే?" అంటా బసవాయిని యిశారించింది ఎంకాయి.

"చరే, పెద్దోణ్ణయిపోటంలా! నీకు ముగ్గురు బిడ్డలంటగా, బాగుండారా?" అన్నాడు బసవాయి.

"ఆఁ, బాగుండారయ్యా బసవయ్యా. పెద్దోడిపేరు అళ్ళతాతపేరు పెట్టుకుండారూ, రెండోవాడి పేరు ఎంకటేశ్వర్లు, మూడోదాని పేరు చీతాం." అంది ఎంకాయి.

"నువ్వూ కాత్త పెద్దదానివయినా మడిసివి అంతగా మార్లేదులే" అన్నాడు బసవాయి పక్కుకి తిరిగి వుమ్మూస్తా.

"ఏబ్బే అదేందయ్యా యింగా పెద్దదాన్ని కాలేదంటావు ముగ్గురు బిడ్డలయితేని! యింగానయం! నువు పెద్దోడివయ్యావు. సానా సన్నబడ్డావు". అంది ఎంకాయి.

"తాత్త మద్దెమద్దె వొల్లు పెద్దాకచ్చిండేలే– శానా ఏళ్లకాలా మరీ—" అన్నాడు బసవాయి.

"సానా ఏళ్లయింది" అంది ఎంకాయి.

"అంతా నిన్నమొన్న జరిగినట్టుంది," అన్నాడు బసవాయి.

దూరాన గొడ్డు ఆ దీడ గెనువులెంట తిరుగుతుంటే గొడ్డపిల్లకాయలు బిల్లంగోడు ఆడుకుంటుండారు.

"బలే బయ్యంబుట్టింది" అంది ఎంకాయి.

"నవు కోక పైకెగ్గట్టుకుని ఎగిగెడ్డేవొచ్చి ఆడ నిలబట్టం యింగా కల్లల్లో మెదుల్తుండది," అన్నాడు బసవాయి.

"ఎట్టాపట్టుకుండా ఆ తాసుపామునీ – సివరకి ఏం జేశా దాన్నీ? నువా మయిన లగెత్తుకు పొయినాక అదలుబుట్టి సచ్చా. యాడజూసినా అగుపించలా నువ్వు."

"ఆ మూలకిపోయి, దాని యిసంపిండి తల నేలకేసి రుద్దరుద్ది సంపేశా," అన్నాడు బసవాయి.

"ఓమ్మో!" అనరిసింది ఎంకాయి.

"అదిగో - ఎంకాయోవ్ –"

"బలేబయం పుట్టిందిరా బసవాయ్–"

"సంపేత్తివి గదంటే ఎంకాయ్–"

"అదేంది బసవయ్యా ఎనాటికిమల్లే ఒరే ఒరే అంటుండానూ - ఛీ, సచ్చిందాన్ని - యిదేం మడిసినీ - యిహి, యిహి–" అంటా ఎంకాయి నవ్వితే బసవాయీ నవ్వాడు "అంటే అన్నావులే" అంటా.

"సిరికి రాంబెమ్మయ్య అల్చెం అయిపొయిందని గరగళానికి అర్ద రూపాయి బిల్ల యీయనే యీయలేదుగా," అన్నాడు బసవాయి.

"అరి యీడిజిమ్మడా! నిజంగా యీయనే యీయలా?" అంది ఎంకాయి.

"అబ్బే నీతోడు యీయనే యీయలేదుగా! యిత్తే నీకు పావలాబిల్ల ఎప్పుడో యీయకబొయ్యేవాణ్ణా!" అన్నాడు బసవాయి.

"అదేంది బసవయ్యా యింగా పావలా బిల్లంటుండావు–?"

"అంటే ఏంలే. మాటన్నాక యీయకనే బోతినిగా."

"పోనీలే బసవయ్యా - అందరూ బాగుంటే అంతే సాలు."

“అంతేలే ఎప్పటికయినా–” అన్నాడు పక్కకు తిరిగి వుమ్మ్యాస్తా.

“మా పిల్లల్ని సూశావంటయ్యా బసవయ్యా?”

“ఏదీ నువు సూపియ్యకనే పోతివిగా.”

“బలేవోడివిలే! ఆనక మాయింటికొస్తే తప్పేట్టా?” అంది ఎంకాయి నవ్వుతా.

“ఓ బసవయ్యోవ్, ఓ ఎంకాయమ్మోవ్, కాత్తె ఓ పాలి యిటొచ్చి పొండయ్యా మీ మడుసులు బంగారంగానూ?” అని ఒక్క పాలరిశారు బిల్లం గోడుకాడ తగువొచ్చిన గొడ్డ పిల్లకాయలు.